ప్రమాదం అంచున ప్రయాణం

- రక్షణ గోడలు లేని బ్రిడ్జిలు
- కనిపించని సూచిక బోర్డులు
- నేలబావులతో పొంచిన ప్రమాదాలు


వెలుగొండ స్వామి రోడ్డు పరిస్థితి ఇదీ..


రామాపురం రోడ్డు పక్కన ఉన్న నేల బావి


మార్కాపురం రోడ్డు నుంచి రేగడపల్లి పోయే రోడ్డులో బ్రిడ్జి


దర్శి రోడ్డులో మల్లవరం దగ్గర రక్షణ గోడ లేని బ్రిడ్జి

పొదిలి: ప్రయాణ సమయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఆ రహదారులు ప్రాణాలు హరించేలా తయారయ్యాయి. ఆయా మార్గాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవించి కొందరు మృత్యువాత పడగా, ఇంకొందరు క్షతగాత్రులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి–దర్శి రోడ్డులోని మల్లవరం బ్రిడ్జి, కొనకనమిట్ల మండలం రేగడపల్లి రోడ్డులోని బ్రిడ్జిలకు ఇరువైపులా రెయిలింగ్ లేదు. వెలుగొండ స్వామి రోడ్డులో కొండపైన పలు మలుపులు ఉన్నాయి. ఏ ఒక్క చోట కూడా సూచిక బోర్డు లేక పోవడంతో కొత్త వారు తికమకపడుతున్నారు. గనివానిపాడు రోడ్డు శిథిలమైంది. మరో వైపు ఈ రోడ్డు పక్కనే లోతైన గుంతలు కూడా ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పితే గుంతల్లో పడే అవకాశాలున్నాయి. రామాపురం రోడ్డులోని నేల బావి, మార్కాపురం రోడ్డు నుంచి నందిపాలెం వెళ్లే రోడ్డులో నేలబావి, వెలుగొండ స్వామి వద్ద ఉన్న కోనేరు, నాగంపల్లి పాఠశాల వద్ద ఉన్న రోడ్డు పక్కన బావి, సలనూతల రోడ్డులో సచివాలయం దగ్గర ఉన్న బావులు ప్రమాద కేంద్రాలుగా మారాయి. దగ్గరికి వచ్చేంత వరకు అక్కడ బావులు ఉన్నాయని తెలిసే అవకాశం కొత్త వారికి లేదు. అధికారులు స్పందించి బావుల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట అందరికీ తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. నేలబావి దగ్గరకు పోయేంత వరకు అక్కడ బావి ఉందనే విషయం కూడా తెలుసుకోలేరు. వర్షాకాలంలో గడ్డి పెరిగి మార్జిన్ కూడా కనిపించదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
– ఎద్దు నగేష్, రామాపురం

బ్రిడ్జిలకు ఇరువైపులా పిల్లర్లు వేయాలి



బ్రిడ్జిలకు ఇరువైపులా ఫెన్సింగ్ పిల్లర్లు ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర ప్రమాదాలను నివారించవచ్చు. వేగంగా రాకపోకలు సాగించే వాహనదారులు ఏమాత్రం మార్జిన్‌కు వచ్చినా ప్రమాదం పెద్ద ఎత్తున జరుగుతుంది. పిల్లర్లు ఏర్పాటు చేయడం, బ్రిడ్జిల వద్ద పెరిగిన చెట్లను కొట్టివేయడం ద్వారా ప్రమాదాలను నివారించాలి.
– పాతకోట శ్రీనివాసరెడ్డి, రేగడపల్లి

రక్షణ చర్యలు అవసరం



బ్రిడ్జిల వద్ద, వెలుగొండ స్వామి రోడ్డులో కొండపైన, నేల బావుల వద్ద సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలి. జిల్లా పరిషత్‌లో కూడా ఈ విషయంపై అధికారులతో మాట్లాడుతాం. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను అధికారులు తక్షణమే చేపట్టాలి. కొత్త వారికి అవగాహన ఉండేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
– ఎ.ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు, కొనకనమిట్ల

ప్రమాదాలు ఇలా..

- నాగంపల్లి–సలనూతల రోడ్డులో బావి వద్ద జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి.
- మల్లవరం బ్రిడ్జి వద్ద చోటుచేసుకున్న పలు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. సుమారు 20 మంది వరకు గాయాల పాలయ్యారు.
- వెలుగొండ రోడ్డులో జరిగిన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. పదిహేను మంది వరకు క్షతగాత్రులయ్యారు.

క్లుప్తంగా

తెల్లదిన్నెలో వీధిలైట్లు ఏర్పాటు


తెల్లదిన్నెలో ఏర్పాటు చేసిన వీధిలైట్లు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మండలంలోని ఎల్ కోట పంచాయతీ పరిధిలోని తెల్లదిన్నె గ్రామంలో అధికారులు వీధి లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో గత ఆరు నెలలుగా వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన 'అంధకారంలో తెల్లదిన్నె' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోట గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో రైతులు నీటి కోసం వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.నాగజ్యోతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ ప్రాంతం మీదుగా వెలుగొండ ప్రాజెక్టు జలాలు వైఎస్సార్ జిల్లాకు వెళ్తాయని గతంలో అధికారులు తెలియజేశారు. ఈ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉన్నందున సాగునీరు, తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ర్యాగింగ్ చేస్తే జైలుకే..


మాట్లాడుతున్న ఎస్సై అంకమరావు


మార్కాపురం: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకు పంపుతామని రూరల్ ఎస్సై అంకమరావు హెచ్చరించారు. గురువారం స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేసిన వారిపై కేసులు నమోదుచేస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని, విదేశాలకు వెళ్లలేరని, ఉన్నత చదువులు చదవలేరని హెచ్చరించారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చే దిశగా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజబాబు మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'కిట్స్'లో 200 మంది విద్యార్థుల రక్తదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు కాలేజీ చైర్మన్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు. ఆపద్బంధు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనీల్‌కుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.25 వేల విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని నెహ్రూ బజారులో షిరిడీ సాయిబాబా మందిరం తరఫున రూ.25 వేల విరాళాన్ని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, రంగ ప్రసాద్, నాగేశ్వరరావు, విజయ్, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కంభం: ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి తర్లుపాడు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఔరంగబాద్ గ్రామానికి చెందిన వరికుంట్ల శ్రీనివాసులు బైక్‌పై కంభం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలు కాగా మరో బైక్‌పై ఉన్న ఓ వ్యక్తి, ఇంకో మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్ విడుదల

మార్కాపురం టౌన్: నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసిందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. మార్కాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మార్కాపురం మున్సిపాలిటీ, మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలకు 13 మద్యం దుకాణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 11న లాటరీ ద్వారా లైసెన్స్ కేటాయిస్తారని, 12 నుంచి నూతన దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. కాలనీలోని ఓ పాడుబడిన భవనంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామని చెప్పారు. నిందితుల నుంచి రూ.1650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కంభంలో వాసవీ కన్యకాపరమేశ్వరిగా..


మార్కాపురం : వాసవీ మాత ఆలయ మార్గంలో విద్యుత్ దగదగలు


కోలభీమునిపాడులో రాజరాజేశ్వరి అలంకారంలో..


బేస్తవారిపేట : చౌడేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు


పొదిలిలో కన్యకా పరమేశ్వరిగా అమ్మవారు


గిద్దలూరు : రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు

కొనకనమిట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. గొట్లగట్టు రాములవారి దేవస్థానంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి, వేదపండితులు విశేష పూజలు చేశారు. ఉత్సవ ఉభయదాతలుగా చీతిరాల వెంకటేశ్వర్లు, కుమారి వ్యవహరించారు.

వాసవీ మాత అలంకరణలో అమ్మవారు

కొమరోలు: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారు కన్యకాపరమేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు పూజల్లో పాల్గొనగా కమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరిగా అమ్మవారు

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గురువారం రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని అద్దాల మండపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. వీరన్నబావి సమీపంలో ఉన్న కాళికాంబ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు కన్యకా పరమేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జీసీ సుబ్బారావు తెలిపారు.

బేస్తవారిపేట: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు కన్యకాపరమేశ్వరీదేవిగా, సోమవారిపేటలో చౌడేశ్వరీదేవి ఆలయంలో చౌడేశ్వరీదేవిగా, కోటసత్యమాంబదేవి, పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని కోలభీమునిపాడులో ముద్దసానమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గజ్జలకొండ రాజరాజేశ్వరీ పీఠంలో హోమం నిర్వహించారు. అమ్మవారు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు టంగుటూరి భాస్కర్‌రావు, గొలమారి వీరారెడ్డి, గార్లపాటి రామకృష్ణారావు, మేడా శ్రీనివాసరావు, పెసల జనార్దన్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో దేవీ శరన్నవరాత్రులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సబ్ కలెక్టర్ త్రివినాగ్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎస్‌వీ సుబ్బారావు, కోశాధికారి ఆర్‌వీ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శివాలయంలో జ్ఞాన సరస్వతీదేవిగా, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

కంభం: కంభం అమ్మవారి శాలలో వాసవీకన్యకాపరమేశ్వరీ దేవిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.


గొట్లగట్టు రామాలయంలో పూజలు


పెదారికట్ల రాజనగరేశ్వరస్వామి ఆలయంలో..


మార్కాపురం : వాసవీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న సబ్‌కలెక్టర్

కేపీ కొండారెడ్డి మాతృమూర్తికి ఘన నివాళి


కొండారెడ్డి, సుబ్బమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్


చెంచమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేపీ కొండారెడ్డి మాతృమూర్తి కుందురు చెంచమ్మ భౌతికకాయానికి మాజీ మంత్రి సురేష్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొదిలి రూరల్: రైతులు కంది పంటలో వైరస్ తెగులు, ఎండు తెగులు, తుట్టె పురుగు నివారణకు సస్య రక్షణ చేపట్టాలని ఏఓ ఎస్‌కె జైన్‌లాబ్దిన్ తెలిపారు. గురువారం పొదిలి మండలంలోని కొండాయపాలెం, మూగచింతల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. సజ్జ కంకులు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాగు ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించే అంశాలపై అవగాహన కల్పించారు.

కొమరోలు : రబీ సీజన్‌కు సంబంధించి శనగ విత్తనాలను 25 శాతం రాయితీపై అందిస్తున్నట్లు ఏఓ కె.రాజశ్రీ తెలిపారు. మండలంలోని సూరవారిపల్లె గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కందిలో వెర్రి తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఏఓ వివరించారు.

బేస్తవారిపేట: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని ఏఓ జక్కం మెర్సీ పేర్కొన్నారు. గురువారం సలకలవీడులో పొలం పిసుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ ఎఫ్‌ఏ డీవీ శివరామయ్య, పశుసంవర్ధకశాఖ సహాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మొక్కజొన్న సాగు చేసే రైతులు ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని చట్టిరెడ్డిపల్లె, మండలంలోని గడికోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న విత్తన పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా కంపెనీల నుంచి అగ్రిమెంట్లు తీసుకోవాలని చెప్పారు. ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ రైతులకు అవగాహన కల్పించారు.

కంభం: మండలంలోని జంగంగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ స్వరూప, హెచ్‌ఓ శ్వేత పాల్గొని రైతులకు సూచనలిచ్చారు. మిరపలో వైరస్, రసం పీల్చు పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు.

తర్లుపాడు: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన, అధిక దిగుబడి పొందవచ్చని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పెద్ద మస్తాన్ సూచించారు. గురువారం కేతగుడిపి, కలుజువ్వలపాడులో ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన అధికారి రమేష్ మిరపలో తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సౌజన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు

మార్కాపురం టౌన్: మండలంలోని గోగులదిన్నె, రాయవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు కంది రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. వీఏఏలు శివకుమార్, సౌజన్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


అర్ధవీడులో నూతన ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది


ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

పొదిలి రూరల్: పొదిలి ఎంపీడీఓగా గుత్తా శోభన్‌బాబు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. దర్శి మండలంలో ఈఓఆర్డీగా పని చేస్తున్న ఆయన బదిలీపై పొదిలి ఎంపీడీఓ(ఎఫ్‌ఏసీ)గా నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న శ్రీకృష్ణ బదిలీపై కొత్తపట్నం వెళ్లారు. నూతన ఎంపీడీఓను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు చేపట్టిన పీఆర్ ఏఈ

కొమరోలు: మండల పంచాయతీరాజ్ ఏఈగా వీరయ్య గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏఈని కార్యాలయ సిబ్బంది అభినందించారు.

అర్ధవీడు ఎంపీడీఓగా నరసయ్య

బేస్తవారిపేట: అర్ధవీడు ఎంపీడీఓగా నరసయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను కార్యలయ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ కిశోర్‌కుమార్, టీఏలు ఓబయ్య, శివారెడ్డి, వెంకటయ్య, ఆచారి, నాగరాజు పాల్గొన్నారు.

కొనకనమిట్ల ఎంపీడీఓగా ఈశ్వరమ్మ


డీటీ విజయభాస్కర్


బాధ్యతలు చేపట్టిన ఈశ్వరమ్మ


ఈఓఆర్‌డీ సుకుమార్

కొనకనమిట్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.ఈశ్వరమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఉదయగిరి మండల ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై కొనకనమిట్లకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన శ్రీనివాసమూర్తి బాపట్ల జిల్లా చినగంజాం మండల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

తర్లుపాడు: మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా విజయభాస్కర్, ఈఓఆర్డీగా సుకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయా కార్యాలయాల సిబ్బంది వారికి స్వాగతం పలికారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


రోగులను పరిశీలిస్తున్న వైద్యులు

మార్కాపురం టౌన్: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సూచించారు. శాంతిరామ్ వైద్యశాల సహకారంతో గురువారం మార్కాపురంలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మంది వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 60 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాజీవలి, కార్యదర్శి శంకర్, అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అల్లూరెడ్డి, అన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తర్లుపాడుకు చెందిన గోసు సాలమ్మ, ఆమె కుమారుడు గోసు శంకర్‌స్వామి 50,075 రూపాయలు విరాళాన్ని హెచ్‌ఎం సుధాకర్‌కు గురువారం అందించారు. వజ్రోత్సవాల్లో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టినందున తమవంతుగా సహాయాన్ని అందించినట్లు దాతలు తెలిపారు. దాతలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


చెక్కు అందచేస్తున్న సాలమ్మ

గఫార్ అలిఖాన్‌కు అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డు


అబ్దుల్ గఫార్ అలీఖాన్

కంభం: పట్టణంలో ఎంజీబీఈడీ కళాశాల కరస్పాండెంట్ ఎండీ అబ్దుల్ గఫార్ అలిఖాన్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. గత 23 ఏళ్లుగా మహబూబ్ ఫెహరీ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ సొసైటీ ద్వారా సామాజిక సేవ, రక్తదాన శిబిరాలు, అన్నదానం తదితర సేవలకు గుర్తింపుగా అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన గుంటూరులో అవార్డు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు గఫార్ తెలిపారు. ఆయనను పలువురు ప్రముఖులు అభినందించారు.